
సిరి ఆఫీసునుంచొచ్చి బట్టలు మార్చుకుని సోఫాలో కూర్చుంది కాస్త రిలాక్స్‌డ్‌గా. శ్రియ వెళ్లి తల్లి కాళ్లను చుట్టేసి వొళ్లో కూర్చుంది. "హోమ్ వర్క్ చేశావా?" అడిగింది సిరి. శ్రియ సమాధానం చెప్పేలోగానే, సిరి చేతిలోని సెల్‌ఫోన్ మోగింది. నెంబరు చూసి "హాయ్... శంకూ... ఎప్పుడొస్తున్నావింటికి?... ఇంకా ఎంతసేపవుతుంది? ఐ... యామ్... హంగ్రీయార్... తొందరగా వొచ్చేయ్" అని ఫోన్ పెట్టేసింది. "మమ్మీ... ఐ...



# నువ్వు కావాలి

యామ్... ఆల్సో... హంగ్రీ...” అంది గోము గా ఆరేళ్ల శ్రియ.

“నువ్వింకా తిన్లేదా శ్రియా...” ఆశ్చర్యంగా అడిగింది సిరి.

“లేదు... నువ్వు తినిపించు” అంది, తల్లి ఒళ్లో లేచి కూర్చుని, చిలిపిగా ఆమె తలమీద చెయ్యివేస్తూ...



“ఉష్... శ్రియా... నాకు చాలా అలసటగా ఉంది. ఐ... హేవ్.ఎ...హెక్టిక్...డే... వెళ్లు లక్ష్మి తినిపిస్తుంది” అంటూ “లక్ష్మీ...లక్ష్మీ” అంటూ పిలిచింది. వంట యింట్లో చపాతీ పిండి కలుపుతున్న లక్ష్మి పరిగెత్తుకొచ్చింది సిరి పిలుపు విని.

“ఏంటమ్మా?” అడిగింది.

“శ్రియ ఇంకా డిన్నర్ చేయలేదా? ఎందుకింత లేటు? ఎన్నిసార్లు చెప్పాను, శ్రియ ఎనిమిది గంటల లోపల భోంచేసెయ్యాలని? తొందరగా భోంచేసి, తొందరగా పడుకోకపోతే పొద్దున్నే లేవలేదు. బస్సొచ్చే సరికి తయారవ లేదు” శ్రియని ఒళ్లోంచి దింపుతూ అంది సిరి.

“నేను పిలుస్తూనే వున్నానమ్మా... మీతో తింటానని, రావడం లేదు” చెప్పింది లక్ష్మి శ్రియని తన దగ్గరకు లాక్కుంటూ...

“మమ్మీ... నేను నీతోటే తింటాను” దీర్ఘాలు తీస్తూ చెప్పింది శ్రియ.

“అంతలోనే మళ్లీ సెల్ మోగడంతో, తీసి “హాయ్... సుమ్మీ... హౌ...ఆర్...యూ...” అంటూ సంభాషణలో పడింది శ్రియని లక్ష్మి వైపు తోస్తూ... సిరి.

“నేనూ... డాడీ... వొచ్చేదాకా ఉంటాను...” అంది శ్రియ మొండిగా...

“నో... డాడీ రావడానికి ఇంకా లేటవు

శారదా అశోకవర్ధన్

తుంది. లక్ష్మి పెడుతుంది వెళ్లు" అంది సిరి గట్టిగా...

శ్రియ మొండికేసి కదల్లేదు. లక్ష్మి ఎత్తుకుని తీసికెళ్లబోతూ ఉంటే గట్టిగా రాను... ఫో" అంటూ అరిచింది శ్రియ. ఆ అరుపుకి సెల్‌లో అవతలి వాళ్లని ఒక్క క్షణం ఆగమని చెప్పి, "శ్రియా... స్టాప్... ఇట్... వెళ్లి భోంచెయ్యి" అని కొట్టినంత గట్టిగా అరిచింది సిరి. వెంటనే అవతలి వాళ్లతో నవ్వుతూ "సారీ... మా శ్రియ అన్నం తినమంటే తినకుండా గోల చేస్తోంది" అంటూ మళ్లీ ఆఫీసు గొడవలూ, మాటల్లో పడింది సిరి.

శ్రియ కళ్లల్లోంచి నీళ్లు కారుతూ ఉంటే, కళ్లు తుడుచుకుంటూ లక్ష్మి వెనకాలే వెళ్లింది భోజనానికి. లక్ష్మి పెట్టింది ఏదో గబగబా తినేసి, నైటీ వేయించుకుని వెళ్లి తన మంచం మీద పడుకుంది. సిరి ఇంకా సెల్‌ఫోన్‌లో ఏవేవో మాట్లాడుతూనే ఉంది.

"నువ్వు పో... నేనే పడుకుంటా" అంటూ లక్ష్మిని మెల్లగా తోసేసింది శ్రియ.

"సరే... మరి పడుకోవాలి" అంది దుప్పటి సరిగ్గా కప్పి వొచ్చేసి, మంచం దగ్గరి నుంచి జరిగి తలుపు దగ్గర కూర్చుంటూ! సిరి ఇంకా 'సెల్'లో మాట్లాడుతూనే ఉంది.

మరో పది నిమిషాలు తరువాత కాలింగ్ బెల్ మోగడంతో లక్ష్మి వెళ్లి తలుపు తీసింది. శంకర్ లోపలికొచ్చి, డ్రాయింగ్ రూమ్‌లోనే బ్రీఫ్‌కేసు పెట్టి సోఫా మీద "ఉష్..." అంటూ బాగా అలిసిపోయిన వాడిలా 'నెక్ టై' విప్పుకుంటూ కూర్చున్నాడు. అవతలవారికి 'బై' చెప్పి సిరి 'హాయ్' అంది శంకర్‌కేసి చూసి.

'హాయ్! శ్రియ ఏది? పడుకుందా?' అడిగాడు.

"అవును" అంది. లక్ష్మిని కంచాలు పెట్టమని పురమాయిస్తూ.

"సారీ...ఐ...యామ్...లేట్" అన్నాడు 'టై' విప్పి సోఫామీద పడేస్తూ.

"నేనూ లేటుగానే వచ్చాను ఇవ్వాళ. ఒక అరగంటయింది నేనొచ్చి. వచ్చినప్పటి నుంచీ ఫోన్లే... సుమ్మీ... హరీష్...! అబ్బబ్బ... నస" టేబుల్ దగ్గర కూర్చుంటూ చెప్పింది సిరి.

"డా...డీ..." అరిచింది శ్రియ...

"యస్...బేబీ..." సమాధానమిచ్చాడు ఆమె గదిలోకి వెళ్తూ శంకర్.

"శ్రియా... నువ్వింకా పడుకోలేదా?... రోజు రోజుకీ బాగా 'నాటీ' అయిపోతున్నావ్... పడు కో... డాడీ భోంచెయ్యాలి...'వి...ఆర్... వెరీ... టయర్డ్" అంది గట్టిగానే...

"మంచంమీంచి లేవబోయిన శ్రియ తల్లి మాటలకి కదలకుండా కూర్చుండిపోయింది, మంచం దిగకుండా".

శంకర్ శ్రియ మంచం దగ్గరికెళ్లి, శ్రియ బుగ్గలు ముద్దుపెట్టుకుంటూ 'గుడ్ నైట్ బేబీ... పడుకోవాలి. మమ్మీ కేకలేస్తుంది. పొద్దుటే రెడీ అవ్వాలిగా' అని దుప్పటి సరిగ్గా కప్పి వెళ్లిపోయాడు.

ఒకరి ఆఫీసు విషయాలు ఒకరు చెప్పుకుంటూ, ఆ రోజు జరిగిన విశేషాలన్నీ చెప్పుకుంటూ, నవ్వుకుంటూ, మళ్లీ ఫోనొస్తే మాట్లాడుకుంటూ భోజనాలు పూర్తి చేసారు సిరి, శంకర్‌లు.

వాళ్ల భోజనాలు పూర్తయ్యే వరకూ మంచం మీద పడుకున్నా, మేలుకునే ఉంది శ్రియ. తనకి మమ్మీ,డాడీల దగ్గర పడుకోవాలనుంటుంది. కానీ మమ్మీ రానియ్యదు. 'నీ రూమ్‌లో కెళ్లు' అని కోప్పడుతుంది. డాడీ కోప్పడరు కానీ మమ్మీ మాటే వింటారు! ఆలోచిస్తూ ఎప్పటికో

నిద్రలోకి జారుకుంది శ్రియ.

శంకర్‌కి ఆఫీసు పని ఒత్తిడి ఎక్కువగా ఉంది. టూర్లు కూడా ఎక్కువైపోయాయి. సిరికి కూడా ఆఫీసులోని సమస్యలు, వర్కూ ఎక్కువే అయిపోయింది. ఇంటికొచ్చాకయినా హాయిగా ఉండొచ్చనుకుంటే అదీ లేదు. వచ్చీరాగానే ఫోన్ మోగుతూ ఉంటుంది. మాట్లాడి మాట్లాడి, ఎప్పటికో నాలుగు మెతుకులు తిని పడుకుంటోంది సిరి.

"మమ్మీ... ఇవ్వాళ పల్లవి పుట్టినరోజు. సాయంత్రం పార్టీకెళ్లాలి. గిఫ్ట్ కూడా కొనాలి. నువ్వొస్తావా?" అడిగింది శ్రియ.

"మైగాడ్... ఇవ్వాళ సాయంత్రం నాకు ఎక్స్‌పోర్ట్ కమిటీ మీటింగ్ ఉంది. వచ్చేసరికి రాత్రి లేటవుతుంది కూడా. డ్రైవర్ కూడా నా తోటే ఉంటాడు." అంటూ కాస్సేపు ఆలోచించి, "ఒక పని చేద్దాం. డబ్బిచ్చి వెళతాను లక్ష్మికి. ఆటోలో నువ్వూ లక్ష్మి వెళ్లి గిఫ్ట్ కొని, పార్టీకి వెళ్లి వచ్చేయండి. లక్ష్మి తీసుకెళుతుంది నిన్ను" అంటూ గట్టిగా ముద్దు పెట్టుకుంది. అంతలోనే ఫోన్ మోగింది. వెళ్లి రిసీవర్ తీసి మాట్లాడడం మొదలు పెట్టింది సిరి.

శ్రియ తల్లినే చూస్తూ నిలబడింది. సిరి ఫోన్‌లో చాలాసేపే మాట్లాడవలసొచ్చింది. ఆ తరువాత "శ్రియా! ఇదుగో రెండొందలు. లక్ష్మి చేతికియ్యి. సాయంత్రం స్కూలు నుంచి వచ్చాక మొన్న దీపావళికి కొన్న బ్లూ జీన్స్ వేసుకో. దాని మీదకి రెడ్ వైట్ డాట్స్ టీ షర్ట్ కొన్నాం కదా అది వేసుకో... ఓ...కే... నాన్నా..." అంటూ లక్ష్మిని పిలిచి ఆ మాటే చెప్పింది. లక్ష్మి సరేనంటూ డబ్బు తీసుకుంది. శ్రియకి స్నానం చేయించి బడికి తయారుచేయడానికి తీసుకెళ్లింది లోపలికి. సిరి కూడా ఆఫీసుకి తొందరగా వెళ్లాలని స్నానానికి బయలుదేరింది మరో బాత్ రూమ్‌లోకి.

ఆ సాయంత్రం బడి నుంచి రాగానే లక్ష్మి శ్రియని ముస్తాబు చేసి ఆటోలో తీసికెళ్లింది. దారిలో ఒక బొమ్మల దుకాణం దగ్గర ఆగి, సిరి కాగితం మీద రాసిచ్చిన బొమ్మనే కొంది. లక్ష్మి వెంట గిఫ్టు తీసుకుని పల్లవి ఇల్లు చేరుకుంది. గేటు తీసి లోపలికెళ్లగానే హాలంతా చక్కగా అలంకరించి ఉంది. రంగు రంగుల కాగితాలతో, తోరణాల్లా వేల్లాడుతూ కొన్ని కాగితాలు, రంగు రంగుల పెద్ద బెలూన్లూ చాలా అందంగా అలంకరించారు. పల్లవి చక్కటి చిలకపచ్చ రంగు పట్టురంగుకి పెద్ద మెరూన్ బోర్డరున్న లంగా, అదే రకం పట్టు బ్లౌజు వేసుకుని, బుట్ట బొమ్మలా వాళ్లమ్మగారి ఒళ్లో కూర్చుని కబుర్లు చెబుతోంది. మధ్యమధ్య వాళ్ల నాన్నగారు కూడా వచ్చి ఎత్తుకుని ఏవో కబుర్లు చెబుతూ తనని, అందరు పిల్లల్నీ ఆడిస్తున్నారు. కొందరు పిల్లలతో వాళ్ల అమ్మా నాన్నలు కూడా వచ్చారు. అందరూ హడావిడిగా ఉన్నారు. పల్లవి తమ్ముడు పవన్‌ని సైకిల్ తొక్కిస్తూ ఆడిస్తున్నాడు వాళ్ల నాన్న. శ్రియ వాళ్లందరినీ ముచ్చటగా చూస్తోంది. శ్రియని చూసి వాళ్లమ్మ దగ్గరి నుంచి లేచి పరిగెత్తుకొచ్చింది పల్లవి. శ్రియ చేతికి బెలూన్లందించింది. పిల్లల కేరింతలతో బెలూన్ ఆటలతో కోలాహలంగా మారిపోయింది యిల్లు, చిలుకలదండు ఒక్కచోట చేరి కిలకిలమని పలుకుతూన్నట్టు.

"ఎలా వచ్చావ్ శ్రియా... మీ మమ్మీ రాలేదా?" అడిగింది పల్లవి వాళ్లమ్మ గీతా ఆంటీ.

"మమ్మీకి మీటింగ్ ఉంది ఆఫీసులో... ఆయాతో వచ్చాను" అంది శ్రియ మెల్లగా.

కాస్సేపటికి కేక్ కట్ చేసింది పల్లవి. వాళ్లమ్మగారి నోట్లో పెద్ద ముక్క పెట్టేసింది

పల్లవి "ఏయ్ చిన్నది చాలు" అంటూ ఉంటే వినకుండా. "దొంగా నీ పని చెప్తానుండు" అంటూ వాళ్లమ్మగారు పల్లవి నోట్లోనూ పెద్ద ముక్క పెట్టేసింది. పల్లవి నవ్వుతూ కష్టపడి తింటూఉంటే అందరూ చప్పట్లు కొట్టేశారు. వాళ్లమ్మగారు అందరికీ ప్లేట్లో కేకు, బిస్కట్లు, 'పిజ్జా' ముక్కలూ పెట్టి ఇచ్చింది. శ్రియ కళ్లార్పకుండా పల్లవిని, వాళ్లమ్మనీ చూస్తూ ఉంది పారవశ్యంగా. గేటు దాకా వొచ్చి టాటా చెప్పారు, లక్ష్మితో శ్రియాని జాగ్రత్తగా తీసికెళ్లమని చెబుతూ.

ఇంట్లోకెళ్లగానే శ్రియ టెలిఫోన్ తిప్పింది సిరికోసం. ఫోన్‌రింగయింది. "ఏంటి శ్రియా...! పార్టీకెళ్లొచ్చావా? నేను బిజీగా వున్నాను మీటింగ్‌లో. ఏంకావాలో చెప్పు..." అడిగింది సిరి.

"మమ్మీ... నువ్వెప్పుడొస్తావు ఇంటికి!?" అడిగింది శ్రియ.

"చెప్పాను కదా పొద్దున్న. ఇవ్వాళ మీటింగు ఉందని. లేటవుతుంది. లక్ష్మి అన్నం పెడుతుంది. బుద్ధిగా తినేసి పడుకో! ఓ.కే... బై..."

"మమ్మీ..."

"ఊ... డిస్టర్బ్ చెయ్యక ఫోన్ పెట్టెయ్యి" అంటూ ఫోన్ కట్ చేసింది సిరి.

"శ్రియకి కోపం, దుఃఖం రెండూ ముంచుకొచ్చాయి. ఫోన్ పెట్టేసి మూతిముడుచుకుని కూర్చుంది.

పొద్దుపోయింది. లక్ష్మి అన్నానికి పిల్చినా రాలేదు శ్రియ. అలాగే మొండిగా బట్టలైనా మార్చుకోకుండా కుర్చీలోనే నిద్రపోయింది. ఎంతలేపినా లేవకుండా నిద్రపోయిన శ్రియని ఎత్తుకుని తీసుకెళ్లి మంచం మీద పడుకోబెట్టింది లక్ష్మి...

మధ్య రాత్రిలో శ్రియ బాగా మూలగడం వినబడి లక్ష్మి లేచివెళ్లి, వొంటిమీద చెయ్యి వేసి చూసింది. వొళ్లు కాలిపోతోంది. ప్రక్క గదిలో పడుకున్న సిరి బెడ్‌రూం తలుపు కొట్టింది. సిరి లేచి తలుపు తీసి "ఏమయింది లక్ష్మి?" అడిగింది.

"శ్రియమ్మకి జ్వరం బాగా ఉందమ్మా... వొళ్లు మసిలిపోతోంది. మూలుగుతోంది" చెప్పింది లక్ష్మి.

"ఏం తింది అక్కడ?"

"ఏం లేదమ్మా... ఒక కేకు ముక్క, ఒక చిన్న పిజ్జా ముక్క... అంతే... ఇంట్లో మళ్లీ భోజనం కూడా చేయలేదు"

సిరి "థర్మామీటర్" తెచ్చి జ్వరం చూసింది. నూట రెండు ఉంది. "మైగాడ్" అంటూ గడియారం చూసింది. టైము రాత్రి రెండు గంటలయింది. అప్పుడు డాక్టరుగారికి ఫోన్ చేయడం బావుండదు. సమయానికి శంకు కూడా ఊళ్లో లేడు, అనుకుంటూ మందుల రాక్ తీసి దాంట్లోంచి క్రోసిన్ సిరప్ తీసి సగం చెంచా వేసింది. శ్రియ మూలుగుతూనే కళ్లు తెరిచి తల్లిని చూసి సిరప్ తీసుకుంది. శ్రియని తీసికెళ్లి తన గదిలో తన మంచం మీద పడుకోబెట్టుకుంది. మెల్లగా తెల్లారకట్ట జ్వరం జారింది. ఆ రోజు స్కూలు మాన్పించి, డాక్టర్ దగ్గరకి తీసికెళ్లింది. అతనేవో మందులు రాసిచ్చాడు.

జ్వరం తగ్గడానికి దాదాపు వారం రోజులు పట్టింది శ్రియకి. మనిషి జ్వరంతో పీక్కుపోయి డల్‌గా అయిపోయింది. తిండి సరిగ్గా తినడం లేదు. దానికి తోడు ఆఫీసులో అనేక రాజకీయాలు. సిరికి పని ఎక్కువైపోయింది. శంకర్‌కి టూర్లు ఎక్కువయ్యాయి. శ్రియకేం కావాలన్నా అన్నీ లక్ష్మి చూసుకోవలసి వస్తోంది. శ్రియ మాత్రం మౌనిలా తయారయింది. యాంత్రికంగా బడికి వెళ్లిరావడం తప్పితే ఇంకే పనీ ఉత్సాహంగా చేయడం లేదు. టీ.వీ. కార్టూన్స్ కూడా సరిగ్గా

చూడడంలేదు. భోజనమూ అంతంత మాత్రం గానే చేస్తోంది. సిరి, శంకర్‌లు బెంగపెట్టు కున్నారు. డాక్టర్లు ఏమీ లేదు అంటున్నారు.

ఆరోజు ఆదివారం. సిరి శ్రియని వొళ్లో కూర్చోబెట్టుకుని ఆడిస్తోంది. ఎదురుగా సోఫాలో కూర్చుని శంకర్ పేపర్ చదువు కుంటున్నాడు. "శ్రియా! నెక్స్‌ట్ సండే... నీ బర్త్‌డే...! నీ బర్త్‌డే... గ్రాండ్‌గా చేద్దాం. నీ ఫ్రెండ్సందరినీ పిలువు. అందరు అంకుల్సూ, ఆంటీలూ వస్తారు. నీ బర్త్‌డేకి నీకేం ప్రెజెంటు కావాలి?" అడిగింది సిరి.

శ్రియ మాట్లాడలేదు. అసలు బర్త్‌డే పార్టీ అంటే సాధారణంగా పిల్లలు చూపించే సరదా కూడా చూపించలేదు. సిరి ఆశ్చర్యపోయింది. మళ్లీ అడిగింది. "శ్రియా! నీ బర్త్‌డేకి నీకేం కావాలో చెప్పు... వెంటనే నువ్వూ, నేనూ, డాడీ... వెళ్లి కొనేద్దాం. అందర్నీ పిలుద్దాం...! సరేనా?" అడిగింది. శ్రియ సిరి కళ్లలోకి చూసింది. "నిజంగా... చేస్తావా?" అడిగింది తల్లిని. "అదేంటికన్నా... నీకేం కావాలన్నా చేస్తాను. చెప్పు ఏం కావాలో? రెట్టించి అడి గింది.

"ప్రామిస్..." చెయ్యిచాచి చేతిలో చెయ్యి వేసి చెప్పమన్నట్టుగా అడిగింది.

"ప్రామిస్" అంటూ చేతిలో చెయ్యి వేసింది సిరి. "ఏం అడుగుతుందా?" అని పేపరు ప్రక్కన పెట్టి శ్రియనే చూస్తున్నాడు శంకర్...!

"మమ్మీ...! నాకు నువ్వు కావాలి. ఆ రోజంతా నువ్వు ఆఫీసుకి పోకూడదు... ఫోన్లో చాలాసేపు మాట్లాడకూడదు. నాతోటే ఉం డాలి... నాకు పార్టీ...ఒద్దు..." అంది తల్లి కళ్లల్లోకి ఆశగా చూస్తూ.

"సిరికి నోట మాట రాలేదు."

"శంకర్ పరిస్థితి కూడా ఇంచుమించు అంతే." సిరి, శంకర్‌లు ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. శ్రియకేసి చూసారు. శ్రియ తల్లి సమాధానం కోసం ఎదురుచూస్తోంది.

"ఓ...కే...! తప్పకుండా... ఇంకా నీకేం కావాలి! కొత్త డ్రెస్సులూ..."

"అవి సరే... పార్టీలొద్దు... నువ్వూ... నేనూ డాడీ, అలా బయటకెళ్లి పిజ్జా తిందాం. అంతే! ఒక డ్రెస్సుకొను. కానీ నువ్వు నాతోటే ఉండాలి, పల్లవీ వాళ్ల మమ్మీలాగా...! కావాలంటే ఒక్క పల్లవిని పిలుస్తా మనతో అంతే!

సిరి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇంచుమించు శంకర్‌కి కూడా...! ఆ పిల్ల తల్లికోసం, తల్లితో గడపడానికి ఎంత తపించి పోతోందో అర్థమ యింది. "ఈ బిజీ జీవితాలలో ఉద్యోగాల్లో పడి, పిల్లల పరిస్థితి, వాళ్ల మనోభావాలను పట్టించు కోలేకపోతున్నాం. ఆయాలూ, అమ్మమ్మలూ, మామ్మలూ ఎంత బాగా చూసుకున్నా, పిల్లలకి కావలసినది అమ్మ ఒడి, నాన్న తడి." శంకర్‌తో అంది సిరి, "శంకూ... ఒక సంవత్సరం నేను ఉద్యోగంమానేస్తాను. ఆ తరువాత శ్రియకి కొం చెం తెలుస్తుంది! ప్రస్తుతం షీ... ఈజ్... మిస్సిం గ్...మీ... దానికి మనోవ్యాధే తప్ప, మరో వ్యాధి లేదు" అంది.

"యూఆర్ కరెక్ట్! అలాగే చెయ్యి" అన్నాడు.

"థాంక్యూ శంకూ" అంది సిరి.

"శ్రియా... లక్ష్మిని నీకూ, నాకూ, డాడీకి బ్రేక్ ఫాస్ట్ పెట్టమని చెప్పు" అంది.

లేడి పిల్లలా ఒళ్లోంచి లేచి గెంతి వెళ్లింది. "లక్ష్మి... నాకూ... మమ్మీకీ... డాడీకీ... బ్రేక్‌ఫాస్ట్ పెట్టెయ్యి... ఆకలేస్తోంది" అంది సంతోషంగా.

శ్రియ మొహంలోని ఆనందాన్ని చూసి మై మరచిపోయారు సిరి, శంకర్. ●